క్లుప్తంగా

ఘనంగా బక్రీద్ వేడుకలు

ఆరిలోవ: త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండగను శనివారం ఆరిలోవ ప్రాంతంలో ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు ఆచరించారు. మసీదుల్లో ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలు చేశారు. ఖురాన్ పఠించి, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం శాంతి ర్యాలీలు నిర్వహించారు. ఉదయం నుంచే మసీదుల వద్దకు చేరుకున్న ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం తమ పెద్దల సమాధుల వద్దకు వెళ్లి ఇష్టమైన ఆహార పదార్థాలు, పూలు ఉంచి ప్రార్థనలు చేశారు. బక్రీద్ వేడుకల్లో భాగంగా ముస్లిం యువత, చిన్నారులు సందడి చేశారు. మసీదుల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

బయోడైవర్సిటీ పార్కును సందర్శించిన విద్యార్థులు



బయోడైవర్సిటీ పార్కులో విద్యార్థుల సందడి

బీచ్‌రోడ్డు: నగరంలోని ఒక ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు శనివారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్కు పర్యవేక్షకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, అవి పెరిగే వాతావరణం గురించి వివరించారు. విద్యార్థుల మొక్కల విశేషాలను తెలుసుకుని పార్కులో సందడి చేశారు.

మెదడు సంకేతాలను గుర్తిస్తే.. ఆరోగ్యం పదిలం

ఎంవీపీకాలనీ: మెదడు అందించే సంకేతాలను నిత్యం గుర్తిస్తూ అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మెడికవర్ హాస్పిటల్స్ చీఫ్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ సురేష్ తాతినేని పేర్కొన్నారు. ఈ నెల 8న ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డేను పురస్కరించుకుని వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించేందుకు మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సెషన్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. నిత్యం అందరూ తలనొప్పిని పని ఒత్తిడిగా, మతిమరపును వయసు ప్రభావంగా, కళ్లు తిరగడాన్ని అలసటగా భావిస్తారన్నారు. అవి మన శరీరంలో చోటుచేసుకునే తీవ్ర సమస్యకు సంకేతాలనే విషయాన్ని గమనించరని చెప్పారు. మనిషి ఆరోగ్యంగా ఉండటంలో బ్రెయిన్ అందించే సంకేతాలను గమనించడం ఎంతో అవసరమన్నారు. దాని ద్వారా అనేక శారీరక సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యానికి మనమే బాటలు వేసుకున్నట్లు అవుతుందన్నారు. బ్రెయిన్ ట్యూమర్ సమస్యలను సరైన సమయంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి తులసిపూజ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి నిర్వహించిన త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయదాతలు భాగమ య్యారు. ప్రతి శనివారం నిర్వహించే తులసిపూజలో పాల్గొనే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ. 1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

పెళ్లివారింట్లో చోరీ

పెదగంట్యాడ: మండలంలోని సీతానగరంలో ఓ పెళ్లివారింట్లో చోరీ జరిగింది. సీతానగరంలో నంబారు శ్రీనివాసరావు కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5న రాత్రి అతని సోదరుడు వెంకటేష్ వివాహాన్ని అతని ఇంటి సమీపంలో ఉన్న పాఠశాల మైదానంలో నిర్వహించారు. పెళ్లి సందర్భంగా ఇంటికి తాళాలు వేయకుండా తలుపులు దగ్గరగా వేసి ఉంచారు. ఇదే అదునుగా దొంగ నక్లెస్, నాలుగు జతలు చెవిదిద్దులు మొత్తం మూడు తులాల బంగారం చోరీ చేశాడు. పెళ్లి వేడుక ముగించుకొని ఇంటికి వెళ్లి చూస్తే బంగారం, సెల్‌ఫోన్లు కనిపించలేదు. దీంతో ఆయన న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేరు ఘనం.. సౌకర్యాలు శూన్యం



ఎక్కడ చూసినా విరిగిన సిమెంట్ బెంచీలు, ఊడిన పలకలు, శిథిలమైన గచ్చు, చెత్త కుప్పలు, నిల్వ ఉన్న ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు, కళావిహీనమైన స్క్రీన్ వేదిక, విరిగిన రెయిలింగ్, వెలగని లైట్లే దర్శనమిస్తున్నాయి. ఇవన్నీ ఎక్కడో రోడ్డు పక్కనో.. డంపింగ్ యార్డు వద్దో అనుకుంటే తప్పులో కాలేసినట్లే.. నగరంలోని ముఖ్యమైన పర్యాటక కేంద్రాల్లో ఒకటైన తెన్నేటి పార్కుదే ఈ పరిస్థితి. ఒకప్పుడు ఎన్నో సౌకర్యాలతో పర్యాటకులను ఆకట్టుకున్న పార్కు ఇది. ఇప్పుడు వీఎంఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యానికి గురై సందర్శకులకు అసౌకర్యాలతో స్వాగతం పలుకుతోంది. దీంతో వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

- ఆరిలోవ



శిథిలావస్థలో కళావేదిక



పార్కులో పలుచోట్ల విరిగిన సిమెంట్ బెంచీలు



పార్కు లోపల శిథిలమైన మెట్లు

తెన్నేటి పార్కులో సమస్యల తిష్ట

- బెంచీలు, మెట్లు, గచ్చులు, రైయిలింగ్ శిథిలం
- వెలగని పలు విద్యుత్ లైట్లు
- పార్కు పక్కనే వ్యర్థాల కుప్పలు
- ఇబ్బంది పడుతున్న సందర్శకులు
- వీఎంఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యంతో ఈ దుస్థితి

నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలు కైలాసగిరి, రుషికొండ బీచ్‌కు వెళ్లే రోడ్డులో జోడుగుళ్లపాలెం సమీపంలో తెన్నేటి పార్కు ఉంది. సాగర తీరాన విశాలమైన పార్కు కావడంతో రోజూ వేల మంది సందర్శిస్తుంటారు. ఓ పక్క సముద్ర అలల హోరు.. మరోపక్క పచ్చని కొండలు ఇక్కడ పర్యాటకులకు ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. సాయంత్రం వేళల్లో పార్కులో కూర్చొని షిప్‌యార్డుకు వెళ్తున్న విదేశీ నౌకలు, చేపల వేటకు వెళ్తున్న తెర చాపలతో కూడిన బోట్లు కనువిందు చేస్తాయి. అటువంటి ఈ పార్కులో అనేక సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడ సందర్శకుల కోసం వీఎంఆర్‌డీఏ అధికారులు ఒకప్పుడు ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు విరిగిపోయాయి. పార్కులో సముద్రం వైపు రక్షణ వలయంగా ఏర్పాటు చేసిన రెయిలింగ్ శిథిలమైంది. సందర్శకులు నడిచే పలుచోట్ల గచ్చు, మెట్లు దెబ్బతిన్నాయి. సందర్శకుల నుంచి పార్కులో ఏర్పడిన చెత్త ఎక్కడపడితే అక్కడ కుప్పలుగా వేసి వదిలేస్తున్నారు. ఈ వ్యర్థాలు వర్షం పడినప్పుడు తడిచి దుర్వాసన వెదజల్లుతున్నాయి. పార్కులో ఎక్కువ చోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదు. సాయంత్రం వేళల్లో ఇక్కడ సేదదీరేవారు చీకటిలో గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

కైలాసగిరికి అనుసంధానంగా..

తెన్నేటి పార్కు కైలాసగిరికి అనుసంధానంగా మారింది. కైలాసగిరికి వెళ్లే సందర్శకులు, విదేశీ పర్యాటకులు ఎక్కువ శాతం మంది తెన్నేటి పార్కును సందర్శిస్తారు. ఇది కైలాసగిరి కిందను సముద్రం ఒడ్డున ఉంది. కైలాసగిరి పైనుంచి చూస్తే ఈ పార్కు ఒకపక్క సముద్రం, మరోపక్క కొండల మధ్యలో చిన్న దీవిలా కనిపిస్తుంది. అందుకే కైలాసగిరి పైకి వెళ్లిన వారిలో ఎక్కువ మందిని ఇది ఆకర్శిస్తోంది. సాయంత్రం వేళ ఇక్కడ ఆహ్లాదకరమై వాతావరణం ఉండటంతో వేల మంది సందర్శకులు ఈ పార్కులో గంటల తరబడి గడుపుతుంటారు. ఇలాంటి పార్కులో విద్యుత్ దీపాలు వెలగకపోవడం, విరిగిన బెంచీలు, శిథిలమైన గచ్చులు, మెట్లు మొదలగు సమస్యలతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు.



పార్కు లోపల ఊడిన పలకలు





విరిగిన సిమెంట్ బెంచీలు

కళావిహీనమైన సాంస్కృతిక వేదిక

ఈ పార్కులో సమారు 15 ఏళ్ల కిందట ఇక్కడ కళావేదిక నిర్మించారు. దీనిపై నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల ప్రదర్శనలు నిర్వహించేవారు. వేదికపైనే పెద్ద సైజ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. దానిపై ప్రతి రోజు సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించి సందర్శకులను కనువిందు చేసేవారు. ఇప్పుడు అవేవీ కానరావడం లేదు. కొన్నాళ్లుగా ఈ కళావేదిక మూలకు చేరింది. దీని స్క్రీన్ పనికిరాకుండా పోయింది. కళావేదిక గచ్చులు, గోడలు ఊడిపోయాయి. దీన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో ఇది నిరుపయోగంగా మిగిలింది. వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి తెన్నేటి పార్కును సమస్యల రహితంగా తీర్చిదిద్ది, సౌకర్యాలు కల్పించాలని నగరవాసులు, సందర్శకులు కోరుతున్నారు.



ఖాళీ వాటర్ బాటిళ్లు, చెత్త

అధికారులు పట్టించుకోవాలి



ఎంతో పేరు కలిగిన తెన్నేటి పార్కును అధికారులు పట్టించుకుని అభివృద్ధి చేయాలి. ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఇలాంటి పార్కులో ఎక్కడపడితే అక్కడ బెంచీలు విరిగిపోయాయి. పార్కు అభివృద్ధిపై సంబంధిత అధికారులు దృష్టిపెట్టాలి.

– రాజా, విశాలాక్షినగర్

పార్కులో సౌకర్యాలు కల్పించాలి



ఎంతో ఆకర్షణీయమైన తెన్నేటి పార్కులో సౌకర్యాలు కల్పించాలి. సందర్శకులు కూర్చునే బెంచీలు విరిగిపోయాయి. ఒకప్పుడు కళాకారులను ప్రోత్సహించేలా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే కళావేదిక ఇప్పుడు నిరుపయోగమైంది. అధికారులు దీనిని పునర్నిర్మించాలి.

– భీమారావు, విశాలాక్షినగర్



తెన్నేటి పార్కులో సీ వ్యూ పాయింట్ వద్ద విరిగిన రెయిలింగ్

కనకమాంబ పండగకు వేళాయె

- నేటి నుంచి వార్షిక మహోత్సవం
- రేపు తొలేళ్లు, 10న అనుపోత్సవం
- ఇసుకతోట ఆలయంలో ఏర్పాట్లు పూర్తి



అలంకరణలో కనకమాంబ



ఇసుకతోట కనకమాంబ అమ్మవారి ఆలయం

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువైన శ్రీకనకమాంబ, నెల్లి పోలమాంబ, ఎర్నిమాంబ అమ్మవార్ల పండగకు వేళాయింది. ఆదివారం నుంచి వార్షిక మహోత్సవం ఘనంగా ప్రారంభమవుతుందని శ్రీకృష్ణా ఉమా మహేశ్వర సాయిదుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు గొలగాని అప్పారావు, బొట్ట శివ, ఈగల సత్యం, అధ్యక్షుడు ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పల్ల అప్పారావు, ప్రసాది అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గోపికృష్ణ తెలిపారు. ఈ నెల 10 వరకు వేడుకలు జరుగుతాయన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పండగ మూడు రోజుల పాటు సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 8న చాటింపు, కలశ పూజ ప్రారంభం, 9న తొలేళ్ల సంబరం, అమ్మవార్లకు కుంకుమ పూజలు, లలిత సహస్ర పారాయణం జరుగుతాయని వెల్లడించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రాత్రికి బుర్రకథ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. 10వ తేదీ ఉదయం 4 గంటల నుంచి కనకమాంబకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. ఉత్సవ కమిటీ కోశాధికారిగా గొలగాని అప్పలరాజు, సహాయ కార్యదర్శిగా గొలగాని రామచంద్రరావు, జాయింట్ సెక్రటరీగా మువ్వల శ్రీను, ముగడ శేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఈగల రమణ, ఈగల గోపి, ఒమ్మి గోపినాథ్, పల్ల శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్, ప్రసాది వినోద్ వ్యవహరిస్తారని చెప్పారు.

పిల్లల్లో స్వతంత్ర ఆలోచనలు ముఖ్యం

ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్

సీతంపేట: జీతం కోసమే కాకుండా జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా పిల్లలను తయారు చేయాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవి కిరణ్ అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం హైవే సమీపంలోని కస్టమ్స్ జీఎస్టీ నార్కోటిక్స్ జాతీయ అకాడమీ(నాసిన్)లో శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించేతత్వం పెరగాలని, నేటి ఏఐ కాలంలో బట్టీ పట్టే చదువులకు చోటు లేదన్నారు. పిల్లల్లో స్వతంత్రంగా ఆలోచించే మనస్తత్వం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. రోజూ పిల్లలు కొద్దిసేపు అయినా ఆంగ్ల దినపత్రికలు చదవాలని సూచించారు. ఇష్టమైన హాబీల్లో పిల్లలను ప్రోత్సహిస్తే వారు మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాల వైపునకు మళ్లకుండా ఉంటారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ విషయంలో ప్రాధాన్యమివ్వాలన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.

రైల్వే న్యూకాలనీలో కార్డన్ సెర్చ్



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతంపేట: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే న్యూకాలనీ ప్రాంతంలో శనివారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈస్ట్ సబ్ డివిజన్ సిబ్బంది సాయంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొని తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వాహనాలు, వ్యక్తులను, ఇళ్లను అణువణువూ పరిశీలించారు. దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. అనుమానిత వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

కేజీహెచ్‌లో ఫార్మసీ కౌంటర్, పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం

అల్లిపురం: కేజీహెచ్‌లో నూతన ఫార్మసీ కౌంటర్, టిస్లా సెంటర్ వద్ద రోగుల కోసం నిర్మించిన నిరీక్షణ షెడ్లు, మార్చురీ ఆవరణలో నిర్మించిన పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ అవుట్ పోస్ట్ భవనం లేకపోవడం వల్ల ప్రజలు, పోలీస్ సిబ్బంది చాలా ఇబ్బంది పడేవారన్నారు. కేజీహెచ్ పరిసరాల్లో ఐదు కిలోమీటర్ల పరిధిలో 24/7 డ్రోన్ల నిఘా ఉంటుందని, తద్వారా కేజీహెచ్‌లో పని చేస్తున్న మహిళా సిబ్బందికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

కల్యాణ శోభ



సీతారామచంద్రస్వామి కల్యాణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



సత్యదేవుని కమనీయ పరిణయం

డాబాగార్డెన్స్: జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం 8 గంటలకు నిత్య హోమాలు, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన స్వామి దివ్య తిరు కల్యాణోత్సవానికి నగరం నుంచే గాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేద మంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య స్వామి కల్యాణం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ ఈవో టి. రాజగోపాలరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, ఫణిహారం నరసింహమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు నిత్య కార్యక్రమాలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు నిత్యపూజలు, హోమాలు జరపనున్నారు.

కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామికి విశేష ఆరాధన, నిత్యహోమాలు, బలిహరణ నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ

అల్లిపురం: ఏడాది గడుస్తున్నా అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు కూటమి ప్రభుత్వం పరిష్కరించాలేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం దేశవ్యాప్తంగా జరిగే అఖిలభారత సమ్మెలో అంగన్‌వాడీ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జగదాంబ వద్ద సీఐటీయూ యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను ఆమె గుర్తు చేశారు. సమ్మె కాలంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అర్బన్ ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా ఆర్. ఈశ్వరమ్మ, అధ్యక్షురాలిగా శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. తులసి, కోశాధికారిగా ఇందిర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా ఎర్రయమ్మ, పార్వతి ఎన్నికయ్యారు. శివలక్ష్మి, రాధ, నజ్మా, వల్లి రాణి, పైడికొండ, కుమారి, మహాలక్ష్మిలను సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, బృందా, వెంకటలక్ష్మి, పద్మ, పి. మణి తదితరులు పాల్గొన్నారు.

సింహాచలేశునికి స్వర్ణ తులసీదళార్చన



స్వర్ణ తులసీదళాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.